# సంగారెడ్డిలో బీఆర్ఎస్ జెండా ఎగురవేయాలి

- సమన్వయంతో పని చేస్తేనే గెలుపు సాధ్యం
- మాణిక్యమ్‌కు భవిష్యత్ ఉంది.. పార్టీ గుర్తిస్తుంది
- ఆర్థిక, వైద్యారోగ్యశాఖల మంత్రి హరీశ్‌రావు



మంత్రి హరీశ్‌రావును కలిసిన సర్పంచ్ నిర్మలాదేవి, బీఆర్ఎస్ నాయకులు

సంగారెడ్డి, అక్టోబర్ 24: సంగారెడ్డి గడ్డపై బీఆర్ఎస్ జెండాను ఎగురవేయాలని, నాయకులందరూ కలిసికట్టుగా పని చేయాలని ఆర్థిక, వైద్యారోగ్య శాఖల మంత్రి హరీశ్‌రావు అన్నారు. దసరా తర్వాత నిర్వహిస్తున్న అలయ్ బలయ్ కార్యక్రమానికి నారాయణఖేడ్ వెళ్తున్న మంత్రి హరీశ్‌రావు మార్గమధ్యంలో డీసీసీబీ వైస్‌చైర్మన్ పట్నం మాణిక్యమ్ ఇంటికి రావడంతో మంత్రికి మాణిక్యమ్ దసరా శుభాకాంక్షలు తెలిపారు. మంగళవారం పట్నం మాణిక్యం నివాసంలో మీడియా సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నారాయణఖేడ్‌లో నిర్వహిస్తున్న అలయ్‌బలయ్ కార్యక్రమానికి వెళుతూ మధ్యలో పట్నం మాణిక్యమ్ నివాసానికి వచ్చి కుటుంబసభ్యులతో కలిసి చర్చలు జరిపి పార్టీ అభ్యర్థిని గెలిపించాలన్నారు. ఈసారి శాసనసభ ఎన్నికల్లో సంగారెడ్డి గడ్డపై గులాబీ జెండా ఎగరవేయాలని మాణిక్యమ్, తన అనుచరులతో పనిచేసి అభ్యర్థి విజయానికి కృషి చేయాలన్నారు. కలిసికట్టుగా పార్టీ అధిష్టానం నిర్ణయానికి కట్టుబడి పని చేసి అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. నాయకుల సమన్వయంతో పనిచేస్తే బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపు సాధ్యమవుతుందన్నారు. మాణిక్యమ్‌కు మంచి భవిష్యత్ ఉందని.. త్వరలో అధినేత దగ్గరుకు తీసుకెళ్లి పార్టీ గుర్తించి అండగా ఉంటుందని భరోసాఇచ్చా రు. అనంతరం మంత్రి పట్నం మాణిక్యమ్‌ను తన వెంటా తీసుకెళ్లారు. మంత్రికి దసరా శుభాకాంక్షలు తెలిపిన వారిలో సంగారెడ్డి అభ్యర్థి చింతా ప్రభాకర్, నాయకులు మామిళ్ల రాజేందర్, ఎంపఏ ముఖీమ్ తదితరులు ఉన్నారు.

# ఎన్నికల వేళ బీఆర్ఎస్‌లో భారీగా చేరికలు

- కాంగ్రెస్, బీజేపీ వీడి గులాబీ కండువా కప్పకుంటున్న నేతలు
- మంత్రి హరీశ్‌రావు వ్యూహంతో ఖాళీ అవుతున్న కాంగ్రెస్



అందోల్: అల్లాదుర్గం మాజీ జడ్పీటీసీ దంపతులను పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి హరీశ్‌రావు, పక్కన ఎమ్మెల్యే క్రాంతికిరణ్, నేతలు (ఫైల్)

సంగారెడి అక్టోబర్ 20(నమస్తే తెలంగాణ) : అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న కొద్ది బీఆర్ఎస్ పార్టీలోకి చేరికలు పెరుగుతున్నాయి. సంగారెడ్డి జిల్లాలోని ఐదు నియోజకవర్గాల్లోని కాంగ్రెస్, బీజేపీ నాయకులు సొంతపార్టీని వీడి గులాబీ కండువాలు కప్పుకుంటున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చూసి కాంగ్రెస్, బీజేపీ నాయకులు బీఆర్ఎస్‌లో చేరేందుకు ముందుకు వస్తున్నారు. దీనికితోడు రాష్ట్ర ఆర్థిక, వైద్య ఆరోగ్యశాఖా మంత్రి హరీశ్‌రావు రాజకీయ ఎత్తుగడలకు కాంగ్రెస్ పార్టీ చిత్తవుతున్నది. సంగారెడ్డి, అందోలు, జహీరాబాద్ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ ఖాళీ అవుతుంది. మూడు నియోజకవర్గాల్లోని కాంగ్రెస్ నాయకులు సొంత పార్టీని వీడి మంత్రి హరీశ్‌రావు సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నారు. బీజేపీ పార్టీ నాయకులు సైతం బీఆర్ఎస్‌లో చేరుతున్నారు. శుక్రవారం మంత్రి హరీశ్‌రావు సమక్షంలో కాంగ్రెస్, బీజేపీ నాయకులు వంద మంది బీఆర్ఎస్‌లో చేరారు. అల్లాదుర్గం బీజేపీ నేతలు, మాజీ జడ్పీటీసీ మమత, భర్త బ్రహ్మంతోపాటు నాయకులు ఆంజనేయులు, శేఖర్, మెదక్ జిల్లా యువజన సంఘాల జిల్లా అధ్యక్షుడు సాయిలుతోపాటు కాంగ్రెస్, బీజేపీ కార్యకర్తలు వంద మంది బీఆర్ఎస్‌లో చేరారు. జిల్లాలోని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు మహిపాల్‌రెడ్డి, చంటి క్రాంతి కిరణ్, భూపాల్‌రెడ్డి, కొణింటి మాణిక్‌రావు, హ్యాండ్లూమ్ కార్పొరేషన్ చైర్మన్ చింతా పభాకర్‌ల సమక్షంలో కాంగ్రెస్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నారు.

### సంగారెడ్డి జిల్లాలో బీఆర్ఎస్‌లోకి పెరుగుతున్న వలసలు

సంగారెడ్డి జిల్లాలోని ఐదు నియోజకవర్గాల్లో కాంగ్రెస్, బీజేపీ నుంచి బీఆర్ఎస్‌లోకి పెద్ద సంఖ్యలో నాయకులు చేరుతున్నారు. దసరా తర్వాత మరింత మంది నాయకులు బీఆర్ఎస్‌లో చేరనున్నారు. జహీరాబాద్ నియోజకవర్గంలో ఝరాసంగం కాంగ్రెస్ జడ్పీటీసీ వినీల నరేశ్, కాంగ్రెస్ జిల్లా కన్వీనర్ పి.బాలరాజ్ ఇటీవల బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వీరితోపాటు నియోజకవర్గంలోని 500 మంది కాంగ్రెస్, బీజేపీ కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరారు. నారాయణఖేడ్ నియోజకవర్గంలో కాంగ్రెస్ ఎంపీటీసీ ప్రేమలాదేవేందర్, హంగిర్గా(కె) సర్పంచ్ యశోదా, ఉప సర్పంచ్ బీఆర్ఎస్‌లో చేరారు. జూకల్, వల్లూరు, రాయిపల్లి గ్రామాలకు చెందిన 150 మంది కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరారు. అందోలు నియోజకవర్గంలో కాంగ్రెస్ ఎంపీటీసీ ఉమారాణి, ఆల్మాయిపేట సర్పంచ్ బాలమణి, వట్‌పల్లి పీఏసీఎస్ డైరక్టర్ ధర్మేందర్‌రావు, చౌటకూరు సర్పంచ్ మొగులయ్య, లక్ష్మీసాగర్ మాజీ ఉపసర్పంచ్ శివరామ్, కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎర్రోళ్ల పోచయ్య, దేవిదాస్, చింత రవి, అల్లాదుర్గంకు చెందిన నక్క సూర్యకుమార్ బీఆర్ఎస్‌లో చేరారు. అందో లు నియోజకవర్గంలో మరింత మంది నాయకులు బీఆర్ఎస్ పార్టీలో చేరేందుకు ముందుకు వస్తున్నారు. సంగారెడ్డి నియోజకవర్గంలో సైతం కాంగ్రెస్, బీజేపీ నుంచి పెద్ద సంఖ్యలో నాయకులు బీఆర్ఎస్‌లో చేరుతున్నారు. ఇటీవలే బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చింతా ప్రభాకర్ సమక్షంలో సదాశివపేట పట్టణానికి చెందిన కాంగ్రెస్, బీజేపీకి చెందిన 300 మంది నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరారు. దసరా తర్వాత కాంగ్రెస్, బీజేపీ చెందిన మరింత మంది నాయకులు బీఆర్ఎస్‌లో చేరనున్నారు. పటాన్‌చెరు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి సమక్షంలో ఇటీవల జిన్నారం, గుమ్మడిదల మండలాలతో పాటు పటాన్‌చెరు పట్టణానికి చెందిన పలువుర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు బీర్ఎస్‌లో చేరారు. మరింత మంది నాయకులు త్వరలో బీఆర్ఎస్‌లో చేరనున్నారు.

### చేరికలతో కాంగ్రెస్, బీజేపీలో ఆందోళన

సంగారెడ్డి జిల్లాలో రోజురోజుకూ బీఆర్ఎస్‌లో చేరికలు పెరుగుతున్నాయి. ఇది కాంగ్రెస్, బీజేపీ పార్టీ పెద్దలను ఆందోళనకు గురిచేస్తోంది. ఎన్నికల వేళ సొంత పార్టీ నుంచి స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, జిల్లా, మండలస్థాయి నాయకులు బీఆర్ఎస్‌లోకి చేరుతుండటంతో కాంగ్రెస్ పెద్దలకు దిక్కుతోచని పరిస్థితి నెలకొన్నది. బీఆర్ఎస్‌లోకి వలసలు పెరగకుండా ఏమి చేయాలన్నదానిపై కాంగ్రెస్ పార్టీ తర్జనభర్జన పడుతుంది. వలసల కారణంగా ఎన్నికల్లో పార్టీకి నష్టం జరుగుతుందని, బలమైన నాయకులు పార్టీని వీడుతుండటం కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థుల ఓటమికి దారి తీసే ప్రమాదముందని కాంగ్రెస్ అధిష్టానం ఆందోళన చెందుతుంది. మరోవైపు ఎమ్మెల్యే అభ్యర్థులు సైతం తమ నియోజకవర్గాల్లోని పార్టీ నాయకులు వలసపోవటంతో ఆందోళనతో ఉన్నారు. కాంగ్రెస్ పార్టీలో ఎమ్మెల్యే టికెట్ ఆశించిన నేతలు పలువురు పార్టీని వీడే అవకాశాలు ఉన్నాయి. బీజేపీ పార్టీలో సైతం ఇదే పరిస్థితి నెలకొన్నది. వరుసగా నాయకులు, కార్యకర్తలు పార్టీని వీడుతుండటంతో బీజేపీ పెద్దలను కలవరపెడుతుంది.

# పాలపిట్ట సాక్షిగా..

## సీఎం కేసీఆర్, బీఆర్ఎస్‌ను గెలిపించాలి

- నారాయణఖేడ్ ప్రజలు, కార్యకర్తలతో ప్రతిజ్ఞ చేయించిన మంత్రి హరీశ్‌రావు
- సీఎం కేసీఆర్‌ది పనితనమే తప్ప.. పగతనం లేదు
- బసవేశ్వర ఎత్తిపోతల పూర్తి కావాలంటే బీఆర్ఎస్ గెలవాలి
- బీఆర్ఎస్ ఎవరికీ బీటీం కాదు.. తెలంగాణ ప్రజల టీం
- బీఆర్ఎస్ మ్యానిఫెస్టోను గడపగడపకూ వివరించాలి
- కాంగ్రెస్‌ను నమ్మి మోసపోవద్దు
- పారదర్శక పథకాలపై పైరవీకార్ల పెత్తనమైతది
- కుర్చీ కోసం పాకులాడే నైజం రేవంత్‌ది
- కర్ణాటక ప్రజలు పెనంలోంచి పొయ్యిలో పడ్డరు
- 30న నారాయణఖేడ్‌లో సీఎం కేసీఆర్ సభను దిగ్విజయం చేయాలి
- ఖేడ్ బీఆర్ఎస్ కార్యకర్తల మంచి తనమే.. భూపాల్‌రెడ్డిని గెలిపిస్తుంది
- రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్యశాఖల మంత్రి తన్నీరు హరీశ్‌రావు
- నారాయణఖేడ్‌లో అలయ్‌బలయ్‌లో పాల్గొన్న మంత్రి


నారాయణఖేడ్, అక్టోబర్ 24: సీఎం కేసీఆర్‌ది పనితనమే తప్ప పగతనం లేదని, ఎప్పుడూ ప్రజల కోసం ఆరాటమే కానీ మరో ఆలోచన లేదని రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్య శాఖల మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. మంగళవారం నారాయణఖేడ్‌లోని రెహమాన్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన అలయ్‌బలయ్ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డితో కలిసి పాల్గొన్న సందర్భంగా మంత్రి మాట్లాడారు. సీఎం కేసీఆర్ చొరవ కారణంగానే నారాయణఖేడ్ దశదిశ మారిందని, బసవేశ్వర ఎత్తిపోతల పథకం పూర్తయి ప్రతి పొలం వాకిట్లోకి గోదావరి జలాలు పారాలంటే మరోసారి బీఆర్ఎస్‌ను గెలిపించాల్సిన అవసరం ఉందన్నారు. గతంలో ఎట్లున్న నారాయణఖేడ్ నియోజకవర్గం ఇప్పుడెట్ల అయిందని గుర్తు చేసిన మంత్రి ముఖ్యంగా తండాలకు అభివృద్ధి ఫలాలను అందజేసిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కుతున్నదన్నారు. తండాలను పంచాయతీలు చేసుకోవడంతోపాటు రోడ్లు, నాణ్యమైన విద్యుత్, తండాలు, గ్రామాల్లో ఇంటింటికీ నల్లా ద్వారా నీటిని సరఫరా చేస్తున్నామన్నారు. గిరిజనులను 10శాతం రిజర్వేషన్ కల్పించడంతోపాటు గిరిజనుల ఆరాధ్య గురువు సేవాలాల్ మహరాజ్ జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్నదని చెప్పారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే డబుల్ లేన్ రోడ్లు, మార్కెట్ యార్డు, 150 పడకల దవాఖాన, ఎనిమిది గురుకులాలు, 24 గంటల విద్యుత్, కల్యాణలక్ష్మి, కేసీఆర్ కిట్ వంటి అనేక కార్యక్రమాలు చేశామని చెప్పారు. కాంగ్రెస్ పార్టీని నమ్మితే మోసపోతరని, కర్ణాటక ప్రజలు కాంగ్రెస్‌ను నమ్మి పెనంలోంచి పొయ్యిలో పడ్డారని చెప్పారు. అక్కడ గత ప్రభుత్వ హయాంలో ఏడు గంటల విద్యుత్ సరఫరా చేస్తుంటే, కాంగ్రెస్ వచ్చిన తర్వాత మూడు గంటలకు తగ్గించారని చెప్పారు. తండాలకు ఏం చేసినా బీఆర్ఎస్ ప్రభుత్వమే చేసిందని, కాంగ్రెస్ పార్టీ ఏం చేసిందని గిరిజనుల వద్దకు వెళ్లి ఓట్లడుగుతుందని మం త్రి ప్రశ్నించారు. పొరపాటున కాంగ్రెస్ గెలిస్తే ఇప్పుడు కొనసాగుతున్న పారదర్శక పథకాలన్నీ మళ్లీ పైరవీకార్ల చేతుల్లోకి పోతాయన్నారు. పదకొండుసార్లు కాంగ్రెస్‌ను గెలిపిస్తే చేయలేని పని ఈ ఒక్కసారి గెలిపిస్తే చేస్తరా.. అని ప్రజలు ఆలోచించాలన్నారు.



అలయ్ బలయ్‌లో మంత్రి హరీశ్‌రావుకు జమ్మి సమర్పిస్తున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

### కాంగ్రెస్ నాయకుల మాటలు నమ్మితే ఆగమైపోతం..

ఓట్ల కోసం కాంగ్రెస్ నాయకులు చెప్పే మాటలు నమ్మితే ఆగమైతమని, ప్రజలను అయోమయానికి గురి చేసేందుకు వారు అడిగే వంద ప్రశ్నలకు ఒకే ఒక సమాధానంగా కర్ణాటకలో కాంగ్రెస్ పాలన, ప్రజల కష్టాలు చాలన్నారు. తనలో బీజేపీకి వ్యతిరేకంగా పోరాడే డీఎన్ఏ ఉందని కాంగ్రెస్ నేత రాహూల్ గాంధీ అంటున్నారని మరీ తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి డీఎన్ఏ ఏందని ఏబీవీపీ మొదలుకుని బీఆర్ఎస్, తెలుగుదేశం ఇప్పుడు కాంగ్రెస్‌లో ఉన్నారని, కుర్చీ కోసం ఎన్ని పార్టీలైనా మార్చే వ్యక్తి రేవంత్‌రెడ్డి అని అన్నారు. గతంలో సోనియాగాంధీని బలిదేవత అన్న రేవంత్‌రెడ్డికి ఇప్పుడు ఆమే దేవతలాగా కనిపిస్తుందని, ఏ ఎండకా ఆ గొడుగు పట్టే నైజం రేవంత్‌రెడ్డిదని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్‌కు బీటీం బీఆర్ఎస్ అని బీజేపీ, బీజేపీకి బీటీం బీఆర్ఎస్ అని కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతున్నారని తాము ఎవరికి బీ టీం కాదని బీఆర్ఎస్ పార్టీ తెలంగాణ ప్రజల టీం అన్ని మంత్రి హరీశ్‌రావు స్పష్టం చేశారు. నారాయణఖేడ్ నియోజకవర్గంలోని బీఆర్ఎస్ కార్యకర్తలు ఎంతో మంచివారని, పార్టీ కోసం కష్టపడే తత్వం ఉన్న కార్యకర్తలను తాను ప్రత్యక్షంగా చూశానని మంత్రి కితాబిచ్చారు. తెలంగాణ ఉద్యమ సమయంలో గ్రామాల్లో పర్యటించి తెలంగాణ రాష్ట్ర సాధన ఆవశ్యకతను వివరించిన విధంగానే మూడోసారి బీఆర్ఎస్ అధికారం చేపట్టాల్సిన ఆవశ్యకతను ప్రజలకు వివరించాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందన్నారు. దసరా పండుగ రోజు పాలపిట్టను చూసే ఆచారం ఉందని, పాలపిట్ట సాక్షిగా సీఎం కేసీఆర్‌ను, బీఆర్ఎస్ పార్టీని గెలిపిస్తామని ప్రతిజ్ఞ చేయాలన్నారు. స్థానిక బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డిని మరోసారి భారీ మెజార్టీతో గెలిపించడంతోపాటు సీఎం కేసీఆర్‌ను హ్యాట్రిక్ సీఎంగా పట్టం కట్టాలని మంత్రి కోరారు.



మంత్రి హరీశ్‌రావు చేతుల మీదుగా ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డికి విరాళం మొత్తాన్ని ఇస్తున్న విద్యార్థి ప్రకాశ్




ఖేడ్‌లో మాట్లాడుతున్న బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

### గెలిపించి.. సేవ చేసే భాగ్యాన్ని కల్పించండి

ఎల్లప్పుడు ప్రజల మధ్య ఉండి సమస్యల పరిష్కారం కోసం కృషి చేసే తనను మరోసారి గెలిపించి సేవచేసే అవకాశాన్ని కల్పించాలని బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి ప్రజలను కోరారు. గత కాంగ్రెస్ హయాంలో నారాయణఖేడ్ నియోజకవర్గం వెనుకబాటుకు గురైన విషయం ప్రజలకు తెలుసని, కేసీఆర్ ప్రభుత్వంలో సీఎం కేసీఆర్ ఆశీస్సులు, మంత్రి హరీశ్‌రావు సహకారంతో కేవలం ఏడేండ్లలో 70 ఏండ్లలో జరగని అభివృద్ధిని చేపట్టామన్నారు. ఎన్నికల కారణంగా బసవేశ్వర ఎత్తిపోతల పథకం, పలు రోడ్లు, తదితర పనులు చేపట్టాల్సి ఉందని పనులన్నీ పూర్తి కావాలంటే మరోసారి బీఆర్ఎస్ అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందన్నారు. మూడోసారి నారాయణఖేడ్‌లో బీఆర్ఎస్ జెండాను ఎగురవేయడంతోపా టు హ్యాట్రిక్ సీఎంగా కేసీఆర్‌కు ప్రజలు దీవించాలని ఎమ్మెల్యే కోరారు.



అలయ్ బలయ్‌లో మంత్రి హరీశ్‌రావుకు జమ్మి సమర్పిస్తున్న కార్యకర్తలు, ప్రజలు

### బీఆర్ఎస్ మ్యానిఫెస్టో ప్రజలకు తెలియజేయాలి

బీఆర్ఎస్ మ్యానిఫెస్టో గడపగడపకూ చేరవేసి ప్రజలకు తెలియజేయాలని మంత్రి హరీశ్‌రావు పిలుపునిచ్చారు. ప్రస్తుతం రైతుబంధు పెట్టుబడిని రూ.16 వేలకు, రూ.400లకు వంట గ్యాస్ సిలిండర్, సౌభాగ్యలక్ష్మి పథకం ద్వారా పేదింటి మహిళకు రూ.3 వేలు, రేషన్‌కార్డుదారులందరికీ సన్నబియ్యంతో పాటు రైతు బీమా తరహాలో కేసీఆర్ బీమాను ప్రవేశపెడతామన్నారు. కేసీఆర్ బీమా ద్వారా దాదాపు కోటి మందికి లబ్ధి చేకూరుతుందని, వారికి సంబంధించిన ప్రీమియంను ప్రభుత్వమే చెల్లించి రూ.5 లక్షల బీమా సదుపాయం కల్పిస్తుందన్నారు. ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే బీఆర్ఎస్ మ్యానిఫెస్టోకు విస్తృతంగా ప్రచారం కల్పించాలన్నారు.



నారాయణ ఖేడ్‌లో హెలిప్యాడ్ కోసం స్థలాన్ని పరిశీలిస్తున్న మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

### సీఎం సభ చరిత్రలో నిలిచిపోవాలి

ఈనెల 30వ తేదీన నారాయణఖేడ్‌లో నిర్వహించే సీఎం కేసీఆర్ సభ చరిత్రలో నిలిచిపోయే విధంగా నిర్వహించాలని మంత్రి హరీశ్‌రావు నాయకులకు, కార్యకర్తలకు సూచించారు. నారాయణఖేడ్ నియోజకవర్గాన్ని ఊహించని రీతిలో అభివృద్ధి చేసిన సీఎం కేసీఆర్‌కు గ్రామాలు, తండాల నుంచి పెద్దఎత్తున తరలివచ్చి ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డిని ఆశీర్వదించాలన్నారు. ఎంపీపీలు, జడ్పీటీసీలు ఇతర ముఖ్యనాయకులు ఇప్పటి నుంచే ప్రణాళికలు సిద్ధం చేసుకుని వాహనాలు ఏర్పాటు చేసుకుని తండోపతండాలుగా సభకు తరలివచ్చే విధంగా చూడాలన్నారు. అనంతరం మంత్రి హరీశ్‌రావు ఈనెల 30న నిర్వహించనున్న సీఎం కేసీఆర్ సభాస్థలి, హెలిప్యాడ్ కోసం స్థలాలను పరిశీలించి పలు సూచనలు చేశారు.




కర్ణాటకలో కాంగ్రెస్ పాలనలో ప్రజల కష్టాలను వివరిస్తున్న బీదర్ మహిళ హాలియా జాన్

### కాంగ్రెస్‌ను నమ్మి మోసపోయాం : కర్ణాటక మహిళ

కర్ణాటకలో కాంగ్రెస్‌ను నమ్మి మోసపోయిన విధంగా తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ మాయలో పడకుండా బీఆర్ఎస్‌ను గెలిపించుకోవాలని కర్ణాటకలోని బీదర్‌కు చెందిన హాలియాజాన్ సూచించారు. మంగళవారం నారాయణఖేడ్‌లో జరిగిన అలయ్‌బలయ్ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మంత్రి హరీశ్‌రావు సమక్షంలో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఓట్ల కోసం ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలుకు నోచుకోకపోగా ప్రజలకు ఇబ్బందులు ఎక్కువయ్యాయని చెప్పారు. మహిళలకు ఉచితంగా ప్రయాణ సదుపాయం కల్పించినప్పటికీ గతంలో మాదిరిగా గ్రామాలకు బస్సులు నడపడం లేదని, కేవలం మూడు గంటలు మాత్రమే విద్యుత్ సరఫరా చేస్తున్నారన్నారు. మహిళలకు రూ.2,500 ఇస్తామన్న హామీ సక్రమంగా అమలుకు నోచుకోవడం లేదని, అనేక ఆంక్షలు పెట్టి ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణలో బీఆర్ఎస్ అమలుచేస్తున్న పథకాలు చాలా బాగున్నాయని, ఇటువంటి ప్రభుత్వాన్ని మరోసారి దీవించి కాపాడుకోవాలని ఆమె ప్రజలకు పిలుపునిచ్చారు.

### నామినేషన్ కోసం ఎమ్మెల్యేకు విద్యార్థి విరాళం

అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో నారాయణఖేడ్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డికి నామినేషన్ కోసం రూ.25,116లను మండలకేంద్రమైన సిర్గాపూర్‌కు చెందిన విద్యార్థి ప్రకాశ్ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డికి అందజేశారు. మంగళవారం అలయ్‌బలయ్ కార్యక్రమం సందర్భంగా నారాయణఖేడ్‌కు వచ్చిన మంత్రి హరీశ్‌రావు చేతులమీదుగా సిర్గాపూర్ మండల పార్టీ అధ్యక్షుడు సంజీవ్‌రావుతో కలిసి ప్రకాశ్ ఈ మొత్తాన్ని భూపాల్‌రెడ్డికి ఇచ్చారు. బీఆర్ఎస్ పార్టీపై, ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డిపై ఉన్న అభిమానంతో నామినేషన్ కోసం డబ్బులు ఇచ్చిన విద్యార్థి ప్రకాశ్‌ను మంత్రి అభినందించారు. కార్యక్రమంలో జడ్పీ చైర్‌పర్సన్ మంజూశ్రీజైపాల్‌రెడ్డి, టీఎస్‌టీపీసీ చైర్మన్ మఠం భిక్షపతి, డీసీసీబీ వైస్ చైర్మన్ పట్నం మాణిక్యం, మాజీ టీఎన్‌జీవో అధ్యక్షుడు మామిళ్ల రాజేందర్, మండల పార్టీ అధ్యక్షులు, ఎంపీపీలు, జడ్పీటీసీలు, మున్సిపల్ పాలకవర్గ సభ్యులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.